
సాక్షి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 8 । డిసెంబర్ । 2023



సోమశిలలో 34 టీఎంసీల నీరు

సోమశిల: జలాశయంలో గురువారానికి 34.443 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 9,943 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.64,430
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,786
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,960
నవర (8 గ్రాములు)	రూ.47,680

గరిష్టం/కనిష్టం 29.0 /25.0

వాతావరణం

గురువారం గాలిలో తేమ 79 శాతం ఉంది. శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉండి అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

98.94 శాతం పింఛన్ల పంపిణీ

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక నగదు పంపిణీ ప్రక్రియ పూర్తయింది. 3,15,544 మందికి కానుక నగదు అందజేయాల్సి ఉండగా 3,12,209 మందికి పంపిణీ చేశారు. పింఛన్ నగదు పంపిణీలో ముత్తుకూరు, అల్లూరు, రాపూరు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

16న జెడ్పీ సర్వసభ్య సమావేశం

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 16న ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్, జిల్లా వైద్య ఆరోగ్య, విద్యా, పశుసంవర్థక, చేనేత జౌళి తదితర శాఖలపై సమీక్ష జరుగుతుందన్నారు. సమావేశానికి జిల్లా పరిషత్ సభ్యులు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

అయ్యప్పస్వామికి వైభవంగా మండలపూజ



శీవేలి ఉత్సవం

నెల్లూరు(బృందావనం): వేదాయపాలెం స్వామి అయ్యప్ప దేవస్థానంలో మండల పూజోత్సవాలు భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్నారు. మండలపూజ సందర్భంగా అయ్యప్పస్వామికి కేరళ సంప్రదాయ రీతిలో కేరళ తంత్రులు అభిషేక, హోమ, పూజలను విశేషంగా నిర్వహించారు. రాత్రి పవిత్ర పదినెట్టు పడిపూజ (18 మెట్ల పడిపూజ)ను విశేషంగా నిర్వహించారు. దేవస్థానాన్ని పుష్పాలతో అలంకరించారు. భక్తులు స్వామి అయ్యప్పను దర్శించుకుని తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం స్వీకరించారు. ఉభయకర్తలుగా మాల్యాద్రి, మహాలక్ష్మి, దశరథరామిరెడ్డి, లక్ష్మీకాంతమ్మ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను శ్రీస్వామి అయ్యప్ప సేవాసమాజం పాలక మండలి అధ్యక్ష, కార్యదర్శులు జి.శేషగిరిరావు, కె.వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కె.మోహన్‌రావు, బి.మురళీమోహన్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

రైతులకు 80 శాతం సబ్సిడీతో విత్తనాలు

నెల్లూరు(సెంట్రల్): తుపాను ప్రభావం వల్ల నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి సత్యవాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానంగా జిల్లాలో 34 మండలాల్లోని 238 గ్రామాల్లో 11,257 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు గుర్తించామన్నారు. పంట మొదటి దశలో దెబ్బతిన్న రైతులకు 80 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వరి, వేరుశనగ, శెనగ, ఉలవ పంట దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. రైతులు ఆర్‌బీకేల్లో వివరాలు తెలిపి సబ్సిడీపై విత్తనాలు తీసుకోవాలని సూచించారు.

వైద్య కళాశాలలో అక్రమాలపై 14, 15 తేదీల్లో విచారణ

నెల్లూరు సిటీ: అవినీతి ఆరోపణలు వచ్చిన ప్రభుత్వ వైద్య కళాశాలలోని ఇద్దరు ఉద్యోగులపై ఈ నెల 14, 15 తేదీల్లో ఆర్‌డీ విచారణ చేపట్టనున్నారు. వైద్యకళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ సునీత పురుషోత్తమ్, సీనియర్ అసిస్టెంట్ బీఎల్ఎన్ ఆచారిలను విచారించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆ ఇద్దరు అధికారులపై ఫిర్యాదులు వెళ్లాయి. ఈ క్రమంలో 46 మంది వైద్యులు, సిబ్బందిని విచారణ అధికారి ప్రత్యేకంగా విచారించనున్నారు. విచారణ తేదీల్లో ఆయా వైద్యులు, సిబ్బందికి సెలవులు మంజూరు చేయవద్దని నెల్లూరు వైద్య కళాశాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



నిడిగుంటపాళెం వద్ద స్తంభాలు ఏర్పాటు చేస్తూ..

రేయింబవళ్లు శ్రమించి...

తుఫాన్ కారణంగా మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో సోమ, మంగళవారాల్లో అంధకారం నెలకొంది. గొలగమూడి, సర్వేపల్లి తదితర గ్రామాల్లో మాత్రమే మంగళవారం రాత్రికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించగలిగారు. నిడిగుంటపాళెం, గుడ్లూరువారిపాళెం, వెంకటాచలం, మొలకలపూడి, తిరుమలమ్మపాళెం తదితర గ్రామాల్లో ఎక్కువ సంఖ్యలో స్తంభాలు విరిగి, తీగలు తెగిపడటంతో రేయింబవళ్లు ముమ్మరంగా పనులు చేపట్టారు. ట్రాన్స్‌కో ఏఈ టి.తిరుపతయ్య సిబ్బందితో జోరు వానలోనూ పనులు చేయించడంతో బుధవారం సాయంత్రానికి విద్యుత్ సరఫరా చేయగలిగారు.

– వెంకటాచలం

గంటల వ్యవధిలోనే కరెంట్ ఇచ్చారు




గతంలో తుపానులు వచ్చిన సందర్భాల్లో రోజుల తరబడి కరెంట్ లేక నానా ఇబ్బందులు పడేవాళ్లం. తాగునీటికి అనేక అవస్థలు పడి చీకట్లో రోజుల తరబడి గడిపేవాళ్లం. కానీ నేడు వచ్చిన తుపానుతో విద్యుత్ స్తంభాలు పడిపోయినా వెంటనే వాటిని ఏర్పాటు చేసి గంటల వ్యవధిలోనే కరెంట్ ఇచ్చారు. దీంతో అంత పెద్ద తుపాను వచ్చినా మేం పెద్దగా ఇబ్బంది పడలేదు.

– అరుణ, గృహిణి, నెల్లూరు టౌన్

రాత్రి వేళ లైట్లు వేసుకుని...

నెల్లూరు నగర శివారు 30వ డివిజన్‌లోని రాజీవ్ స్వగృహ సమీపంలో దొంతాళి నుంచి నెల్లూరు చెరువులోకి వెళ్లే వరదనీటి ప్రవాహం కారణం తుఫాను సమయంలో పొదలకూరు ఫీడర్ 33 కేవీ విద్యుత్ స్తంభాలు రెండు వాగులో పడిపోయాయి. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలో అంధకారం ఏర్పడింది. వెంటనే కొత్తూరు సబ్‌స్టేషన్ ఏఈ శివశంకర్ నేతృత్వంలో ఒక జేసీబీ, ఒక క్రేన్, 15 మంది సిబ్బంది శ్రమించి పడిపోయిన స్తంభాల స్థానంలో గట్టు ప్రదేశంలో కొత్తవి ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి 11.30 గంటల వరకు పనిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ సిబ్బంది స్పందించిన తీరును ఆయా ప్రాంతాల ప్రజలు అభినందించారు.

– నెల్లూరు రూరల్



రాత్రివేళలో విద్యుత్ తీగలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సేవలకు సలామ్

- నగరం, పట్టణాలకు 24 గంటల్లోనే విద్యుత్ సరఫరా పునఃప్రారంభం
- నాలుగు రోజులుగా 146 ప్రత్యేక టీంలు, 1150 మంది సిబ్బందితో విధులు
- మిచాంగ్ తుపానుతో జిల్లాలో విద్యుత్ సంస్థకు నష్టం రూ.12 కోట్లు
- నీట మునిగిన 7 విద్యుత్ సబ్‌స్టేషన్లలో వెంటనే మరమ్మతులు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిన ప్రాంతాలు 1,362
- సత్వరమే సరఫరా పునరుద్ధరించిన ప్రాంతాలు 1,215

యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

ఆపదకాలంలో ప్రజలకు అండగా నిలిచి వారికి మెరుగైన సేవలు అందించటమే ప్రభుత్వ ఉద్యోగుల విధి. విద్యుత్ ఉద్యోగులు ప్రస్తుతం అదే బాధ్యతతో పనిచేస్తున్నారు. మిచాంగ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు కొన్ని రోజులుగా రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. నేలకొరిగిన విద్యుత్ సబ్‌స్టేషన్లు, స్తంభాలు, లైన్లను చాలా వరకు పునరుద్ధరించారు. నాలుగు రోజులుగా వందలాది మంది సిబ్బంది, అధికారులు క్షేత్ర స్థాయిలో వేగంగా పనులు చేసి ప్రజామన్ననలు అందుకున్నారు.



విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న నెల్లూరు టౌన్-2 ఈఈ మధుసూదనరెడ్డి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/ నెల్లూరు(వీఆర్సీసెంటర్): మిచాంగ్ తుఫాన్ సృష్టించిన బీభత్సం విద్యుత్ సంస్థకు తీవ్ర నష్టాన్ని కలిగించింది. జిల్లాలో వేలాది విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, వందల కిలోమీటర్ల విద్యుత్ లైన్లు కూలిపోవడంతో సంస్థకు రూ.12 కోట్ల మేర నష్టం వాటిల్లింది. విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ప్రకృతి చేసిన నష్టాన్ని మాత్రం ఆపలేకపోయారు. అధికారులు తీసుకున్న ముందస్తు జాగ్రత్తలతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. తుఫాను సృష్టించిన నష్టంతో జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే అధికారుల పర్యవేక్షణలో 146 ప్రత్యేక టీంలుగా ఏర్పడి 1,150 మంది సిబ్బంది రాత్రి, పగలు తేడా లేకుండా విధులు నిర్వహించడంతో పలు ప్రాంతాల్లో ప్రధానంగా నగరాలు, పట్టణాల్లో 24 గంటల వ్యవధిలోపే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించగలిగారు. కొన్ని ప్రాంతాల్లో సబ్‌స్టేషన్లు నీటిలో మునిగిపోవడంతో పనులు చేసేందుకు కష్టతరంగా మారింది. తుఫాన్ కారణంగా జిల్లా సర్కిల్ పరిధిలోని 42 మండలాల్లో 1,362 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యుత్‌శాఖ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి గురువారం నాటికి 1,215 గ్రామాలకు సరఫరాను పునరుద్ధరించారు. ఏపీఎస్పీ డీసీఎల్ సీఎండీ సంతోషరావు సోమవారం అర్ధరాత్రే నెల్లూరుకు చేరుకుని జిల్లా విద్యుత్ అధికారులను అప్రమత్తం చేశారు. మంగళవారం నుంచి తుపానుకు గురయిన ప్రాంతాల్లో స్వయంగా పర్యటిస్తూ జిల్లా అధికారులకు పలు సూచనలు చేస్తూ పనులు పర్యవేక్షించారు. గురువారం సాయంత్రానికి 98 శాతం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ చక్రధర్‌బాబు కూడా జిల్లాలో ఉంటూ సీఎండీతో కలిసి పనుల్లో పాలుపంచుకున్నారు.



విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల్లో సిబ్బంది

98 శాతం పునరుద్ధరించాం

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మిచాంగ్ తుఫాన్ వల్ల చాలా ప్రాంతాల్లో విద్యుత్ సంస్థకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రజలు విద్యుత్ సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతం చేయటంతో నగరాలు, పట్టణాలకు 10 గంటల లోపే విద్యుత్ సరఫరా అందజేయగలిగాం. గూడూరు, నాయుడుపేట, వాకాడు, కోట ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరణ కొంత ఆలస్యం అయినప్పటికీ గురువారం నాటికి చాలా వరకు పూర్తిచేశాం. జిల్లాకు చెందిన సిబ్బందితోపాటు, అదనంగా కర్నూలు నుంచి 250 మంది, ఏలూరు నుంచి 70 మంది అదనపు సిబ్బందిని రప్పించాం. జిల్లా సర్కిల్ పరిధిలో 98 శాతం సరఫరా పునరుద్ధరణ చేశాం. శుక్రవారం నాటికి వంద శాతం విద్యుత్ పునరుద్ధరిస్తాం.

– సంతోషరావు, సీఎండీ, ఏపీఎస్పీడీసీఎల్

ఇంకా పనుల్లోనే సిబ్బంది

తుపాను వల్ల జిల్లాలో విద్యుత్ సంస్థ చాలా నష్టపోయింది. సీఎండీ స్థాయి అధికారి స్వయంగా వచ్చి జిల్లాలో ఉంటూ విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేయిస్తున్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో పాల్గొంటున్నారు. విద్యుత్‌భవన్ అధికారులు కూడా నిరంతరం జిల్లాలో పరిస్థితులపై సమీక్షిస్తున్నారు. జిల్లా సర్కిల్ ప్రజలకు సకాలంలో విద్యుత్ సరఫరా అందించటమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– విజయన్, ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా ఎస్ఈ

పెనుగాలులకు విరిగినా...

ఇక్కడ విరిగిన విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధరిస్తున్న ప్రాంతం పొదలకూరు పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలో ఉన్న వీధి. మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల వీచిన పెనుగాలులకు స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ అధికారులు, సిబ్బంది కలసి యుద్ధప్రాతిపదికన స్తంభాలను పునరుద్ధరించి విద్యుత్ సరఫరా చేశారు. వందల సంఖ్యలో పట్టణం చుట్టుపక్కల స్తంభాలు నేలకొరిగాయి. సిబ్బంది చిత్తశుద్ధిగా పనిచేసి యధావిధిగా విద్యుత్ సరఫరాను అందజేశారు.

– పొదలకూరు



పట్టణంలో విరిగిన విద్యుత్ స్తంభాన్ని తిరిగి నాటుతున్న దృశ్యం

కర్తవ్యమే ధ్యేయంగా..

ట్రాన్స్‌కో జేఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలంలోని 12 పంచాయతీల్లో ఆగిపోయిన విద్యుత్ సరఫరాను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించారు. చాకలికొండ పంచాయతీలోని గోళ్లవారిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతినడంతో తుపాను రోజునే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ఆ గ్రామానికి విద్యుత్ సరఫరా చేశారు. రెండ్రోజుల నుంచి నిరంతరంగా శ్రమిస్తూ వ్యవసాయ విద్యుత్ లైన్లు కూడా పునరుద్ధరిస్తున్నారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది సేవలను ప్రజలు మెచ్చుకుంటున్నారు.

– ఉదయగిరి



గోళ్లవారిపల్లిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న హెల్పర్

జోరు వానలోనూ రిపేర్లు

తుపానుకు పలు గ్రామాల్లో చెట్లు కూలి పోయి విద్యుత్ లైన్లపై పడటంతో తీగలు తెగిపోయాయి. కలిగిరి, గుడ్లదొన, అనంతపురం, కృష్ణారెడ్డిపాళెం, చిన్నఅన్నలూరు, తూర్పుదూబగుంట ప్రాంతాల్లో సుమారు 108 విద్యుత్ స్తంభాలు పడిపోవడం, దెబ్బతినడం జరిగాయి. ట్రాన్స్‌కో ఏడీఏ కృష్ణమోహన్, ఏఈఈ దినేష్ కుమార్ పర్యవేక్షణలో ట్రాన్స్‌కో సిబ్బంది జోరు వానలోనే విద్యుత్ లైన్లను పరిశీలిస్తూ పడిపోయిన చెట్లను తొలగించారు. దెబ్బతిన్న, పడిపోయిన స్తంభాల స్థానాల్లో కొత్తవాటిని ఏర్పాటు చేశారు. విద్యుత్ సిబ్బంది సేవలు భేష్ అని ప్రజలు కొనియాడుతున్నారు.

– కలిగిరి



కలిగిరిలో విద్యుత్ తీగలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కర్షకులెవరూ అధైర్య పడొద్దు



పిడూరులో దెబ్బతిన్న వరినారును పరిశీలిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- ఉదారంగా పరిహారం అందజేస్తాం
- వ్యవసాయశాఖ మంత్రి కాకాణి

పొదలకూరు: రైతులకు ఉదారంగా పరిహారం అందజేస్తామని, కర్షకులెవరూ అధైర్యపడొద్దని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మండలంలోని చాటగొట్ల, అయ్యగారిపాళెం, తాటిపర్తి గ్రామాల్లో మిచాంగ్ తుపాను వల్ల తీవ్రంగా నష్టపోయిన నిమ్మ, మామిడి, దొండ, ఆకుతోటలను అధికారులతో కలసి మంత్రి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధారణంగా విపత్తులు వచ్చి నష్టాలు నెలకొంటే నిబంధనల ప్రకారం ప్రతి పంటకు నిర్ణీత పరిహారం ఉంటుందన్నారు. అయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నష్టపోయే రైతులకు నూరుశాతం పరిహారం అందజేస్తున్నట్టు చెప్పారు. టీడీపీ హయాంలో ఇలాంటి వెసులుబాటు కల్పించి రైతులను ఆదుకున్న పాపాన పోలేదన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఉద్యాన పంటలతో పాటు, వరి నారుమళ్లకు నష్టం వాటిల్లినట్టు తెలిపారు. విపత్తుల సమయంలో ప్రతిపక్షం సలహాలు, సూచనలు చేయాలని అయితే చంద్రబాబునాయుడు రైతులను రెచ్చగొడుతున్నట్టు పేర్కొన్నారు. రైతులు ఇబ్బందుల్లో ఉన్న సమయంలో వారిని ఎలా ఆదుకోవాలని తాము చూస్తుంటే చంద్రబాబు మాత్రం ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి వెంట జిల్లా ఉద్యానాధికారి ఎంవీ సుబ్బారెడ్డి, హెచ్‌ఓ ఈ.ఆనంద్, ఏఓ వాసు, శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విత్తనాలు పంపిణీ చేసిన మంత్రి

మనుబోలు: మండలంలోని పిడూరు గ్రామ పరిధిలో జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణితో కలిసి మంత్రి కాకాణి గురువారం పర్యటించారు. దెబ్బతిన్న నారుమళ్లను పరిశీలించారు. అనంతరం సచివాలయంలో నారుమళ్లు దెబ్బతిన్న రైతులకు 80 శాతం సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల మిచాంగ్ తుఫాన్ సందర్భంగా భారీ వర్షాలకు ఎక్కడా ప్రాణ నష్టం, భారీ ఆస్తి నష్టం జరగలేదన్నారు. తుఫాన్ తాకిడికి దెబ్బతిన్న పొలాలకు సంబంధించిన వివరాలను ఈనెల 9వ తేదీలోపు నివేదికలు తెప్పించుకుని ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివకృష్ణయ్య, ఎంపీడీఓ ప్రసాద్, ఏఓ జహీర్, హౌసింగ్ ఏఈ రవికుమార్, ఎంపీపీ వజ్రమ్మ, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పంట నష్టం అంచనాలు



ఇందుకూరుపేటలో కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

- అధికారులకు కలెక్టర్ హరినారాయణన్ ఆదేశం

ఇందుకూరుపేట: తుఫాన్ కారణంగా దెబ్బతిన్న నారుమళ్లు, ఉద్యాన పంటల నష్టాల అంచనాలను పారదర్శకంగా, పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని ఇందుకూరుపేట, జంగంవానిదొరువు గ్రామాలలో తుఫాన్‌కు దెబ్బతిన్న వరి పంట పొలాలను కలెక్టర్ గురువారం పరిశీలించి, స్థానిక రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పొలాల్లో నిలిచి ఉన్న వర్షపు నీరు త్వరగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే వెల్లువ కాలువలను కలెక్టర్ పరిశీలించారు. ఈయన వెంట తహసీల్దారు సుబ్బయ్య, వ్యవసాయశాఖ ఏడీ రాజ్‌కుమార్, ఎంపీడీఓ నాగేంద్రబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

యుద్ధప్రాతిపదికన చర్యలు

విద్యుత్ పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు అన్నారు. మండలంలోని జగదేవిపేటలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలో జరిగిన నష్టంపై అధికారులతో ఆరాతీశారు. మరమ్మతులను పటిష్టంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయ్‌కుమార్‌రెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సునీల్ కుమార్, ఏఈ రమేష్, స్థానిక నాయకులు బట్టేపాటి నరేంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.



పేద రోగులకు సుభోజనం

నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వివిధ ప్రాంతాల నుంచి చికిత్స నిమిత్తం వచ్చే పేషెంట్లకు మంచి రుచికరమైన పౌష్టికాహారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తోంది హరే కృష్ణ చారిటబుల్ ఫౌండేషన్. ప్రతిరోజూ మధ్యాహ్నం ఉచితంగా సుభోజనం పేరుతో అన్నదానం చేస్తోంది. ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చే పేదవారి ఆకలి తీరుస్తూ ఈ ఫౌండేషన్ ఉదారత చాటుకుంటోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు





'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేద్దాం



క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: 'ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర చరిత్రలోనే అతి పెద్ద క్రీడా సంబరం. అందరం కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం.' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం క్రీడా కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. క్రీడలు ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. చంద్రబాబు నాయుడు ఏనాడు క్రీడాకారుల విషయంలో శ్రద్ధ చూపలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఆడుదాం ఆంధ్రా విజయవంతానికి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొందరు క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా ఆర్థిక పరిస్థితుల కారణంగా వెలుగులోకి రారన్నారు. వారికి ఈ కార్యక్రమం వరమన్నారు. ప్రతిభ ఉండి అవకాశాల కోసం ఎదురుచూసే గ్రామీణ క్రీడాకారులు పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, ఎంపీపీ పార్వతి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, బొందిల కార్పొరేషన్ చైర్మన్ కిశోర్ సింగ్, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, నాయకులు హరిప్రసాద్‌రెడ్డి, వసంతకుమార్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీకుమారి, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీ కరపత్రాలను ప్రదర్శిస్తున్న మంత్రి కాకాణి, ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో పేదలకు భరోసా

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి

నెల్లూరు(దర్గామిట్ట): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు కొండంత భరోసా లభించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్యం పొందడం ఎలా అనే కరపత్రాలను గురువారం నెల్లూరులోని డైకాస్‌రోడ్డులో ఉన్న క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్యశ్రీ కరపత్రాలు అందించి ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. సంబంధిత యాప్‌ను స్మార్ట్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేయిస్తారని చెప్పారు. జనవరి 18 నుంచి అర్హులందరికీ నూతన కార్డులను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, 104, 108 ద్వారా పేదలకు వైద్యసేవలు అందుతున్నట్లు తెలిపారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వైద్యం అందించాలనే లక్ష్యంతో నూతన ఆరోగ్యశ్రీ కార్డులను అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కూనం సుధాకర్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం



సచివాలయ ఉద్యోగులకు కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: 'గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం. అందులో భాగంగానే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.' అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలిలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ సచివాలయ ఉద్యోగులకు క్రీడా కిట్లను గురువారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ కలిగిన క్రీడాకారులను దేశానికి అందించడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. ప్రతి గ్రామ/వార్డు సచివాలయం పరిధిలో మ్యాచ్‌లు నిర్వహించి యువతకు మంచి అవకాశాలు కల్పించడానికి ఆడుదాం ఆంధ్రా దోహదపడుతోందన్నారు. ఆసక్తి గలవారంతా వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. రాష్ట్ర స్థాయి విజేతలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఆడుదాం ఆంధ్రా వంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టలేదని ఎమ్మెల్యే అన్నారు. ఆడపిల్లలు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. క్రీడాకారులకు తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు. రాజకీయ నాయకులు ఎన్నికలప్పుడే వస్తారనే అభిప్రాయం ప్రజల్లో ఉండేదని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ట్రెండ్‌ను సృష్టించారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రతి నాయకుడిని నిత్యం ప్రజల్లో ఉండేలా చూశారన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వీకే శీనానాయక్, ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, ఎంపీపీ కొండమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు జంపాని రాఘవులు, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అధికారుల పనితీరు అభినందనీయం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(టౌన్): 'తుఫాన్ సమయంలో అధికారుల పనితీరు అభినందనీయం. వేగంగా స్పందించి యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు.' అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులోని కృష్ణచైతన్య జూనియర్ కళాశాలలో ఉన్న తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తుఫాన్ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం వెంటనే అప్రమత్తమై నష్ట నివారణ చర్యలు చేపట్టిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అండగా నిలిచారన్నారు. కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి అహర్నిశలు శ్రమించారన్నారు. 21 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించి ప్రాణనష్టం లేకుండా చర్యలు తీసుకున్నారని చెప్పారు. నగర కమిషనర్ వికాస్ మర్మత్ తక్షణ చర్యలు చేపట్టి అనేకమందికి మంచినీరు, పునరావాసం కల్పించారని తెలిపారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది ఎంతగానో శ్రమించి సరఫరాను పునరుద్ధరించడం అద్భుతమన్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పర్యవేక్షణలో అధికారులు, వలంటీర్లు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు సేవలందించారన్నారు.

మినీ ట్రక్ బోల్తా

మర్రిపాడు: మండలంలోని నందవరం మోడల్ స్కూల్ సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. బద్వేల్ నుంచి నెల్లూరు వైపునకు టమోటా లోడుతో వెళ్తున్న బొలెరో మినీ ట్రక్ అదుపుతప్పి బోల్తా పడింది. టమోటాలు నేలపాలయ్యాయి. డ్రైవర్ నిద్రమత్తులోకి వెళ్లడంతో ప్రమాదం జరిగినట్లు చెబుతున్నారు.

వైద్య కళాశాలలో పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు సిటీ: నెల్లూరులోని ఏసీఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఒక సంవత్సరం పాటు తాత్కాలిక పద్ధతిలో సీనియర్ రెసిడెంట్స్‌ను క్లినికల్, నాన్ క్లినికల్ విభాగంలో నియమించేందుకు చర్యలు తీసుకున్నామని ఆ కళాశాల ప్రిన్సిపల్ వసుంధర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 13వ తేదీలోపు ఎస్‌పీఎస్‌నెల్లూరు.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే వాటిని 13వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా కళాశాలలో సమర్పించాలన్నారు.

సమస్యలు త్వరితగతిన పరిష్కరించాం



ముంగమూరుగోపిరెడ్డి వీధిలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్

- నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చేశామని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ తెలిపారు. నెల్లూరులోని ఎన్టీఆర్ నగర్, రాయపుపాళెం, తడికలబజార్, బర్మాషెల్‌గుంట, వెంగళరెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే గురువారం అధికారులతో కలిసి పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న కొద్దిపాటి సమస్యలను తెలుసుకుని యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ ఈదురుగాలుల కారణంగా రెండురోజుల్లో 250కు పైగా విద్యుత్ స్తంభాలు, వందలాది చెట్లు పడిపోయాయన్నారు. మెయిన్ లైన్లు తీవ్రంగా దెబ్బతిన్నట్లు చెప్పారు. వర్షం తగ్గిన వెంటనే విద్యుత్, మున్సిపల్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేసి 90 శాతానికి పైగా సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. కడప, కర్నూలు జిల్లాల నుంచి విద్యుత్ సిబ్బంది వచ్చి రాత్రింబవళ్లు సహాయక చర్యల్లో పాల్గొన్నారన్నారు. కష్టపడి పనిచేసిన అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. నగర నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ఎప్పటికప్పుడు స్థానికులతో మమేకమై పరిస్థితులను గమనిస్తూ సహాయక చర్యలను చేపట్టామన్నారు. వసతుల కల్పనలో కార్పొరేటర్లు, స్థానిక నాయకుల కృషిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గోతం అరుణ, మొగళ్లపల్లి కామాక్షీదేవి, ఓబిలి రవిచంద్ర, సంక్రాంతి అశ్విని, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేనున్నానంటూ..

- తుఫాన్ సమయంలో ప్రజలకు అండగా..
- ఆత్మకూరు ఆర్డీఓ సేవలు ఆదర్శం



బాధితులతో మాట్లాడుతున్న ఆర్డీఓ (ఫైల్)

ఆత్మకూరు: ఆమె రెవెన్యూ డివిజనల్ కేంద్రం అధికారిణి. ప్రభుత్వ ఆదేశాలతో తుఫాన్ సమయంలో ప్రజలకు అండగా నిలిచారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు తనవంతు కృషి చేశారు. ఆమే ఆత్మకూరు ఆర్డీఓ మధులత. రెండు నెలల క్రితం విజయవాడ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. మిచాంగ్ తుఫాన్ సహాయక చర్యల్లో భాగంగా ఎప్పటికప్పుడు మండల స్థాయి అధికారులకు తగిన ఆదేశాలిచ్చారు. డివిజన్ పరిధిలోని అనంతసాగరం, చేజర్ల, ఆత్మకూరు, సంగం మండలాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. అనంతసాగరం మండలం దేవరాయపల్లిలో పెన్నా తీరంలో నివాసం ఉంటున్న 30 కుటుంబాలకు చెందిన దళితులను సోమవారం అర్ధరాత్రి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు జోరు వానలోనూ తరలించారు. కొందరిని తన వాహనంలో సురక్షిత ప్రాంతానికి స్వయంగా తీసుకెళ్లగా, మరి కొందరిని ఎండీఎం (బియ్యం సరఫరా) వాహనం ద్వారా పాఠశాలకు తరలించి భోజన వసతి కల్పించారు. ఇదే క్రమంలో కరటంపాడు గ్రామంలో లోతట్టు ప్రాంతంలో ఉన్న గిరిజన ప్రాంతవాసులను ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి దగ్గరుండి తరలించారు. ఓ వైపు హోరు గాలి, మరో వైపు జోరువాన కురుస్తున్నా లెక్కచేయకుండా పనిచేశారు. ఆర్డీఓ తన కుమార్తె పుట్టినరోజును మంగళవారం పునరావాస కేంద్రంలోనే తుఫాన్ బాధితుల మధ్య నిర్వహించారు. వీర్లగుడిపాడు, రేవూరు, దేవరాయపల్లి తదితర పెన్నాతీర గ్రామాల్లో ప్రాణ నష్టం లేకుండా సహాయక చర్యలు చేపట్టడంపై ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్ ప్రత్యేకంగా అభినందించారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కొండాపురం: పేదల సంక్షేమమే లక్ష్యంగా గడప గడపకు సంక్షేమ ఫలాలను చేరవేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని నేకునాంపేట పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసేందుకు సచివాలయ వ్యవస్థను సీఎం ఏర్పాటు చేశారని తెలిపారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రజలకు ఇంటి ముంగిటే ప్రభుత్వ సేవలను అందిస్తున్నారని కొనియాడారు. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు ద్వారా రైతులకు అవసరమైన అన్ని ప్రయోజనాలను గ్రామంలోనే అందిస్తున్నారని తెలిపారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి పేద విద్యార్థుల చదువులకు వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్ పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి అందిస్తుంటే ఎల్లో మీడియా, ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ గతంలో ప్రజలకు ఏమి చేశారో చెప్పకుండా రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని, వారికి ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రతి కుటుంబానికి సాయం అందిస్తామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించి వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బొడ్డు అనూరాధ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిమ్మిలి రవీంద్ర, గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడు కర్తం శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డు మాధవరెడ్డి, దయాకర్‌రెడ్డి, కమలాకర్, సర్పంచ్ బాసం జయమ్మ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వేగంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

- అధికారులు, సిబ్బంది సేవలు అభినందనీయం
- ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు

నెల్లూరు(వీఆర్సీ సెంటర్): మిచాంగ్ తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలులకు దెబ్బతిన్న విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే పనులను వేగంగా పూర్తి చేశామని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు తెలిపారు. నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో గురువారం సాయంత్రం ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ చక్రధర్‌బాబుతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తుఫాన్ కారణంగా తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. విద్యుత్ సంస్థకు భారీగా నష్టం వాటిల్లిందన్నారు. సరఫరాను పునరుద్ధరించేందుకు తాను మూడు రోజుల నుంచి నెల్లూరు జిల్లాలోనే ఉండి పనులను పర్యవేక్షించానన్నారు. వరద ఉధృతి ఉన్న ప్రాంతాల్లో కూడా అధికారులు, సిబ్బంది రేయింబవళ్లు కష్టపడి సరఫరాను పునరుద్ధరించడం అభినందనీయమన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరా కోసం అవసరమైన విద్యుత్ సర్వీసులను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించామన్నారు. కొన్ని ప్రాంతాల్లో నీటి ఉధృతి తగ్గిన తర్వాత శాశ్వత ప్రాతిపదికన పనులు చేయిస్తామన్నారు. విద్యుత్ సరఫరాలో తలెత్తిన అంతరాయాలను గురువారం సాయంత్రానికి పునరుద్ధరించడం జగిందన్నారు. ఇంకా ఎక్కడైనా సమస్యలుంటే టోల్‌ఫ్రీ నంబర్లు 1912, 1800 425 155333 ఫోన్ చేయాలని సూచించారు. లేదా విద్యుత్ సంస్థకు చెందిన వాట్సాప్ నంబర్ 91333 31912 మెసేజ్ చేయాలని కోరారు.

ఐటీఐలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(టౌన్): నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలికల ఐటీఐలో ఏటీఓ పోస్టులను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేస్తున్నామని, ఇందుకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రజియా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను బాలికల ఐటీఐలో తీసుకోవాలన్నారు. పూర్తి చేసిన వాటిని ఈనెల 26వ తేదీలోపు బాలికల ఐటీఐలో సమర్పించాలన్నారు. బీఈ, బీటెక్ ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్ (ఒక సంవత్సరం ఎక్స్‌పీరియన్స్ ఉండాలి), డిప్లొమా మెకానికల్ ఇంజినీరింగ్ ఫ్రం రికగ్నైజ్డ్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (రెండేళ్ల ఎక్స్‌పీరియన్స్ ఉండాలి), ఎన్‌టీసీ/ఎన్‌ఏసీ పాస్డ్ ఇన్ ది ట్రేడ్ ఆఫ్ మెకానికల్ రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషనర్ (మూడేళ్ల ఎక్స్‌పీరియన్స్ ఉండాలి) విద్యార్హతలు ఉండాలన్నారు.

మధురానగర్‌లో యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఆర్థికంగా స్థిరపడలేదన్న మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరులోని మధురానగర్‌లో జరిగింది. పోలీసులు గురువారం వివరాలు వెల్లడించారు. బంగ్లాతోటకు చెందిన ఎస్.వెంకటేశ్వర్లు టైల్స్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన కుమారుడు వాసు (23) ఎంసీఏ పూర్తి చేశాడు. రెండునెలల క్రితం వరకు హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేశాడు. అయితే అతడికి ఉద్యోగం చేయడం ఇష్టం లేదు. చిన్నప్పటి నుంచే వ్యాపారం చేసి ఆర్థికంగా స్థిరపడాలని కోరిక ఉండేది. అందుకు చేసిన ప్రయత్నాలు విఫలమవ్వడంతో మనస్తాపానికి గురై లోలోపల మదనపడసాగాడు. ఈక్రమంలోనే పదిరోజుల క్రితం వాసు అయ్యప్పస్వామి మాల వేశాడు. మధురానగర్‌లో నివాసం ఉంటున్న అతడి స్నేహితుడు లక్ష్మణ్ సైతం మాల వేసుకున్నాడు. ఐదురోజులుగా ఇంట్లో పూజ చేసేందుకు ఇబ్బందిగా ఉండటంతో స్నేహితుడి ఇంట్లోనే ఉన్నాడు. ఆరో తేదీన వాసు తన ఇంటికి వచ్చి పూజలు చేశాడు. రాత్రి గుడికి వెళ్లి వస్తానని చెప్పి స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. అతడి ఇంట్లోని వారు బయటకు వెళ్లడంతో ఒక్కడే ఉన్నాడు. ఈక్రమంలో పంచెతో ఉరి వేసుకున్నాడు. లక్ష్మణ్ కుటుంబసభ్యులు ఇంటికి వచ్చి చూసి వెంకటేశ్వర్లుకు సమాచారం అందించారు. వాసును చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఎం.బాబీ, ఎస్సై శివప్రకాష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య చేసి.. మృతదేహాన్ని పడేసి..



విజయచంద్రపాల్ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన విజయచంద్రపాల్ (53), దానమ్మ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లలు మెడికల్ ఫీల్డ్‌లో ఉన్నారు. విజయచంద్రపాల్ వంట పనిచేసేవాడు. కాగా అతను మద్యానికి బానిసయ్యాడు. మూడేళ్లుగా బుజబుజనెల్లూరు సమతానగర్‌కు చెందిన ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. బుధవారం రాత్రి సుమారు పది గంటలకు పాల్ తన స్నేహితురాలికి ఫోన్ చేసి మాట్లాడాడు. కొద్దిసేపటి అనంతరం ఇంటి నుంచి ఆమె వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. గురువారం ఉదయం నిద్ర లేచిన దానమ్మ ఫోన్ చూసుకోగా రాత్రి 11.46 గంటల ప్రాంతంలో భర్త నుంచి మిస్డ్‌కాల్ వచ్చినట్లు గుర్తించింది. ఆమె మరిది శోభన్‌బాబు సుందరయ్యకాలనీ డీబ్లాక్ మీదుగా సెంటర్‌కు వెళ్తుండగా పాల్ స్కూటీ రోడ్డు పక్కన పడి ఉండడాన్ని గమనించాడు. ఎడమ కన్ను, నుదిటిపై తీవ్ర గాయాలతో పాల్ చనిపోయి ఉండడాన్ని చూసిన శోభన్‌బాబు ఈ విషయాన్ని దానమ్మకు ఫోన్ చేసి తెలియజేశాడు. దీంతో ఆమె వెంటనే తన పిల్లలతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. పాల్ మృతదేహం వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. తన భర్తను ఆయన స్నేహితురాలు, ఆమె కుటుంబసభ్యులు హత్య చేసి మృతదేహాన్ని స్కూటీతోపాటు తీసుకొచ్చి ఎవరికీ అనుమానం రాకుండా ఇక్కడ పడేసి వెళ్లారని బాధితురాలు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్త మృతికి కారణమైన స్నేహితురాలు, ఆమె కుటుంబసభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి దర్యాప్తు చేపట్టారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో విజయచంద్రపాల్ హత్య జరిగిందని, దీని వెనుక స్నేహితురాలు, ఆమె కుటుంబసభ్యుల ప్రమేయం ఉందని దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిసింది. దీంతో హత్య కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో విచారిస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.25
సన్నవి	: రూ.10
పండ్లు	: రూ.5



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 80
లేయర్ (లైవ్)	: 90
బ్రాయిలర్ చికెన్	: 150
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 170
లేయర్ చికెన్	: 153